## క్లుప్తంగా

### కారు ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు



**నాదెండ్ల:** కంపెనీ గోడౌన్‌లో నిలిపి ఉంచిన కారును దుండగులు ధ్వంసం చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. గణపవరం రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన బాధితుడు గళ్ళా శ్రీనివాసరావు మాట్లాడుతూ తన మారుతీ ఎక్స్‌ప్రెస్ కారును ఇంటి సమీపంలోని గోడౌన్‌లో టార్పాలిన్ పట్ట కప్పి పార్కింగ్ చేశాడు. సోమవారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కంపెనీ గేటు దూకి కారు ముందు అద్దాన్ని బండ రాయితో ధ్వంసం చేశారు. ఈ కంపెనీలో సీసీ కెమేరాలు ఉన్నందున సీసీ ఫుటేజీని పరిశీలిస్తే దుండగులను గుర్తించే అవకాశం ఉందని బాధితుడు తెలిపారు.

### మహిళా దినోత్సవం

**బొల్లాపల్లి :** జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 6వ రోజు మహిళా దినోత్సవం సందర్భంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినులకు రంగవల్లులు, ఆల్లికల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా గ్రంథాలయాలకు వెళ్లాలని, సభ్యత్వం తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, ఆదిలక్ష్మి, గ్రంథాలయాధికారి రమావత్ సేవానాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించాలి

**వినుకొండ(నూజెండ్ల):** స్వచ్ఛతను పాటించడం వల్ల ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని నూజెండ్ల ఎంఈవో నలబోలు రవిచంద్ర అన్నారు. నూజెండ్లలోని జడ్పీ పాఠశాలలో మండల రిసోర్స్ పర్సన్ కంచర్ల సుబ్బరామయ్య ఆధ్వర్యంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం పురస్కరించుకొని హమారా సౌచాలయ హమారా సమన్ పేరుతో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వక్కలగడ్డ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు వి.వి.శ్రీనివాసరావు, సుదర్శన్, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆటోకు నిప్పుపెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

**శావల్యాపురం:** మండల కేంద్రంలో ఓ ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన ఆటోకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. బాధితుడు వేముల శ్రీనివాసరావు తెలిపిన వివరాలు మేరకు తన ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన ఆటోకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారన్నారు. చుట్టుపక్కల నివాసాల వారు గమనించే సమయంలోనే ఆటో తగలబడిపోయిందని, తనకు జీవనాధారమైన ఆటో అగ్నికి ఆహుతి కావడంపై ఆవేదన వ్యక్తం చేశాడు. విషయాన్ని స్థానిక పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు కేసు నమోదు చేశారు.

### 24న సీనియర్ బాలికల కబడ్డీ జట్టు ఎంపిక

**నరసరావుపేట రూరల్:** అంతర జిల్లా కబడ్డీ సీనియర్ బాలికల కబడ్డీ సెలక్షన్స్ ఈనెల 24వ తేదీ ఆదివారం నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి మంతెన సుబ్బరాజు మంగళవారం తెలిపారు. పోటీలలో ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 5నుంచి 8వ తేదీ వరకు ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో నిర్వహించే 71వ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. వివరాలకు 9502925925ను సంప్రదించాలని తెలిపారు.

### 24న రాష్ట్రస్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలు

**నరసరావుపేట ఈస్ట్:** న్యూమాంక్స్ కుంగ్‌ఫూ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో 38వ వార్షిక సౌత్ ఇండియా ఆల్‌స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.రాజా శిఖామణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నమెంట్‌లో రాష్ట్రస్థాయిలో కుంగ్‌ఫూ, కరాటే, శిలంబం (కర్రసాము), యోగ, భరత నాట్యం పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పోటీలో విజేతలకు సినీ దర్శకురాలు విజయనిర్మల పేరుమీదుగా బహుమతులు అందిస్తామన్నారు.

### ఇంటిగ్రేటెడ్ స్కూల్లో వైద్య శిబిరం

**నరసరావుపేటటౌన్:** మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ టి. చక్రవర్తి, డాక్టర్ జి. గ్రేస్, డాక్టర్ గాయత్రి, డాక్టర్ బషీరున్నీసాలు పాల్గొని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఇందిర, సిబ్బంది పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీలో మినహాయింపు ఇవ్వండి



**నరసరావుపేట:** పింఛన్ల పంపిణీలో వైద్యఆరోగ్యశాఖ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నూతన కార్యవర్గ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. అలాగే జిల్లా వైద్యశాఖలో నూతనంగా ఎన్నుకున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ప్రతినిధులు కలెక్టర్‌కు పరిచయం చేసుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా సోమ్లానాయక్, ప్రధాన కార్యదర్శిగా పి.సాయి, ఉపాధ్యక్షులుగా మనోజ్‌కుమార్, రేఖ, లీలాకృష్ణ, కోశాధికారిగా వెంకటరావులు ఎన్నికయ్యారు. హెల్త్ క్లినిక్‌లను శుభ్రపర్చేందుకు పంచాయతీ వర్కర్లను నియమించాలని కలెక్టర్‌ను కోరారు. నాగలక్ష్మి, కోటేశ్వరమ్మ, కోటేశ్వరరావు, హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## ముమ్మరంగా ఎమ్మెల్సీ ఓటరు దరఖాస్తుల ప్రక్రియ

- నియోజకవర్గంలో ఓటుకోసం 10,886 మంది పట్టభద్రుల దరఖాస్తు
- ఆన్‌లైన్ ద్వారా 7,668మంది, ఆఫ్‌లైన్ ద్వారా 3218 మంది దరఖాస్తు
- స్క్రూటినీ ప్రక్రియలో తలమునకలైన అధికారులు, సిబ్బంది



దరఖాస్తుల స్క్రూటినీకి బీఎల్‌వోలకు కేటాయించేందుకు కసరత్తు చేస్తున్న అధికారులు, సిబ్బంది

**నరసరావుపేట:** వచ్చే ఏడాది మార్చినెలలో నిర్వహించే ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల శాసనసమండలి సభ్యుడి ఎన్నిక ప్రక్రియలో ఓటర్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ముమ్మరంగా సాగుతుంది. నియోజకవర్గంలో ఒక పురపాలక సంఘం, రొంపిచర్ల, నరసరావుపేట రూరల్ మండలాలు ఉండగా ఎమ్మెల్సీ ఓటుకోసం మొత్తం 10,886 మంది పట్టభద్రులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఆన్‌లైన్‌లో 7,668 మంది దరఖాస్తు చేసుకోగా, స్వయంగా కార్యాలయాలకు వచ్చి దరఖాస్తులు అందజేసిన వారు 3,218 మంది ఉన్నారు. పురపాలక సంఘంలో 7,157 మంది మొత్తం దరఖాస్తు చేసుకోగా ఆన్‌లైన్ ద్వారా 4776, స్వయంగా 2381 మంది దరఖాస్తులు అందజేశారు. అలాగే రొంపిచర్ల మండలంలో మొత్తం 1241 దరఖాస్తులు రాగా, వాటిలో ఆన్‌లైన్ ద్వారా 1114, స్వయంగా 127మంది దరకాస్తులు అందజేయగా, నరసరావుపేట రూరల్ మండలంలో మొత్తం 2,488 దరఖాస్తులు రాగా, వాటిలో 1778 మంది ఆన్‌లైన్ ద్వారా, స్వయంగా 710 మంది కార్యాలయంకు వచ్చి అందజేశారు. వచ్చిన దరఖాస్తులలో పట్టణ పట్టభద్రులు కొంతమంది మండలాల్లో దరఖాస్తుచేయగా వాటిని పురపాలక సంఘ కార్యాలయంకు పంపించారు. అలాంటి వాటిలో నరసరావుపేట మండలం నుంచి 150 వరకు రాగా వాటిని రొంపిచర్ల, పురపాలసంఘానికి పంపించారు. ఈ మండలంలో వచ్చిన దరఖాస్తుల్లో 315 దరఖాస్తుదారులు సరైన విధంగా దరఖాస్తు చేయనందున వాటిని తిరస్కరించారు. పట్టణంలోని పట్టభద్రుల నుంచి పురపాలక సంఘంలోను, మండలాల్లో ఆయా తహసీల్దార్ల కార్యాలయాల్లో దరఖాస్తులు స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను బీఎల్‌వోలు, సచివాలయ కార్యదర్శుల ద్వారా ఇంటింటికీ తిరిగి పరిశీలన చేయించారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కువగా వారు పొందుపర్చిన పత్రాలకు గజిటెడ్ ఆఫీసర్ సంతకం లేకుండానే వచ్చినట్లు నిర్ధారించి పరిశీలన ప్రక్రియలో వారి నుంచి మరో సెట్ దరఖాస్తును అందజేయాలని కోరటంతో పట్టభద్రులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్క్రూటినీ చేసిన దరఖాస్తులను ఉమ్మడి జిల్లా కేంద్రమైన గుంటూరు డీఆర్వోకు పంపేందుకు అధికారులు కసరత్తు చేశారు.

## బాలిక ఉజ్వల భవిత, భద్రతకు కృషి చేయాలి

**నాదెండ్ల:** బాలికల భద్రత, ఉజ్వల భవితకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కవితా అనసూయ చెప్పారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలిక విద్య, సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా హైస్కూలు నుంచి బొడ్డురాయి సెంటర్ వరకూ వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాల్య వివాహాల నివారణ, బాలికలపై అఘాయిత్యాల కట్టడికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు తమ బాలికలను చక్కగా చదివించి వారు జీవితంలో స్వశక్తితో ఎదిగేలా ప్రోత్సహించాలన్నారు.

### విద్యార్థులకు క్విజ్ పోటీలు

**నరసరావుపేట రూరల్:** అఖిల భారత గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శ్రీనాథ సాహితీ పరిషత్, ఆంధ్ర చైతన్య గ్రూప్ ఆధ్వర్యంలో లింగంగుంట్ల కాలనీలోని ఎస్‌సీ బాలుర సంక్షేమ వసతిగృహంలో మంగళవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పోటీలను పుస్తకం, గ్రంథాలయం, స్వతంత్ర ఉద్యమం, జనరల్ నాలెడ్జ్, జాతీయ ఉద్యమకారులు వంటి అంశాలపై నిర్వహించారు. పోటీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు స్వర్ణా చినరామిరెడ్డి, హాస్టల్ వెల్ఫేర్ అధికారి శ్యామలాదేవి, సీనియర్ ఆడిటర్ షేక్ బాజీ పాల్గొన్నారు.

**యడ్లపాడు:** మండల కేంద్రమైన యడ్లపాడు శాఖ గ్రంథాలయము నందు 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయ అధికారి సిహెచ్.అంజమ్మ అధ్యక్షతన జరిగింది. యడ్లపాడు జిల్లా పరిషత్ స్కూల్, నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్, సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను ఏర్పాటు చేశారు. విజేతలకు ఈనెల 20వ తేదీన జరిగే ముగింపు వేడుకలలో బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయ అధికారి తెలిపారు. కార్యక్రమంలో జడ్పీహైస్కూల్ హెచ్‌ఎం బి విజయభారతి, నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ చెరుకూరి సృజన, సెయింట్‌ఆన్స్ ప్రిన్సిపల్ రోజాప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**నరసరావుపేట ఈస్ట్:** శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల గ్రంథాలయం విభాగం ఆధ్వర్యంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని జాతీయస్థాయి ఆన్‌లైన్ క్విజ్ పోటీలను మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పది రోజుల పాటు ఆన్‌లైన్ క్విజ్ పోటీలు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. క్విజ్ పోటీలో కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని సర్టిఫికెట్లు కూడా ఆన్‌లైన్‌లో పొందవచ్చని వివరించారు. ఆన్‌లైన్ లింక్ కోసం 9985540558 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, గ్రంథాలయాధికారి పి.రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలి



ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారిణులు

**నరసరావుపేట ఈస్ట్:** మహిళలు ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లోనూ ప్రగతి సాధించాలని పలువురు వక్తలు తెలిపారు. 57వ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో మంగళవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి యడ్లపాటి రాధ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారిణి దీప్తి, అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ డి.వెంకటరమణ, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డి.సునీత, మండల న్యాయ సలహాదారు టి.అమూల్య పాల్గొని వివిధ రంగాలలో మహిళలు సాధించిన విజయాలను విద్యార్థినులకు వివరించారు. నేటి సమాజంలో మహిళలపై అవాంఛనీయ ఘటనలు చేటుచేసుకోవటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఎటువంటి సమస్యనైనా మహిళలు ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని తెలిపారు. మహిళా ప్రధాని ఇందిరాగాంధీ, ఝాన్సీలక్ష్మీబాయి, రుద్రమదేవి వంటి మహిళలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తొలుత ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థినిలకు రంగోలి (ముగ్గులు) పోటీ నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి యడ్లపాటి రాధ మాట్లాడుతూ, గత ఆరు రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో విజేతకు 20వతేదీ బుధవారం ముగింపు సభలో బహుమతులు అందచేస్తామని తెలిపారు.

**గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి**

**నాదెండ్ల:** గ్రంథాయాలను విద్యార్థులు, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి ఆర్.శ్రీనివాసరావు చెప్పారు. నాదెండ్ల శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, రంగవల్లులు, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. బుధవారంతో గ్రంథాలయ వారోత్సవాలు ముగియనున్నందున ఉదయం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాంబశివరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రీమియం చెల్లింపుతో బీమా ధీమా

**శావల్యాపురం:** ప్రీమియం చెల్లింపుతో బీమా సౌకర్యం పంటలకు వర్తిస్తుందని ఏడీఏ బోయపాటి రవిబాబు మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు చేసిన పంటలకు అన్నదాతలు ప్రీమియం చెల్లించటం ద్వారా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద బీమా ప్రయోజనాలు పొందవచ్చునన్నారు. అతివృష్టి, అనావృష్టి ప్రకృతి వైపరీత్యాలు జరిగిన నేపథ్యంలో బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. రబీ సీజనుకు జిల్లాలో బీమా పథకంలో వరి పంటను ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ఒక హెక్టారు వరి పంటకు బీమా ప్రీమియం రూ.ఒక లక్ష 5 వేల రూపాయలు కాగా కేవలం రైతు రూ. 1575 రూపాయలు చెల్లించాలన్నారు. ఈ పథకాన్ని జనరల్ ఇండియా బీమా ఇన్సూరెన్సు కంపెనీ జిల్లాలో అమలు చేస్తుందన్నారు.

**ఈ పంట నమోదు చేసుకోవాలి**

రైతులు తాము సాగు చేసిన పంటను ఈ-పంట నమోదు చేసుకుంటే బ్యాంకుల నుంచి రుణం తీసుకొని అందులో నుంచి బీమా ప్రీమియాన్ని మినహాయించుకుంటున్నారన్నారు. బ్యాంకుల నుంచి రుణం తీసుకోని రైతులు మీసేవా కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లు, రైతులకు బ్యాంకు ఖాతాలున్న బ్యాంకుల్లో నగదు చెల్లించాలన్నారు. ఇందులో భాగంగా రైతులు ఆధార్, బ్యాంకు ఖాతా నంబరు, పట్టాదారు పాసుపుస్తకం, పంట ధ్రువీకరణ పత్రం సెల్‌ఫోను నంబరు, రైతు సేవాకేంద్రాల్లో అందజేయాలన్నారు. రబీలో సాగు చేసిన వరి పంటకు బీమా ప్రీమియం డిసెంబరు 31 గడువు ఉందన్నారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



బోయపాలెం నూలుమిల్లులో రక్తదానం చేస్తున్న కార్మికులు

**యడ్లపాడు:** రక్తదానం ఆపదలో ఉన్న వారిని ప్రాణదానం చేయడమే విశ్వతేజ నూలుమిల్లు ఎండీ దాసరి చంద్రశేఖర్ చెప్పారు. యడ్లపాడు మండలం బోయపాలెంలోని విశ్వతేజ నూలుమిల్లులో మంగళవారం ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గుంటూరుకు చెందిన ఇండియన్ రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో విశ్వతేజ నూలుమిల్లు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ శిబిరంలో మిల్లు యాజమాన్యం, ఉద్యోగులు, కార్మికులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎండీ చంద్రశేఖర్ మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా విశ్వతేజ నూలుమిల్లు ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి జానీరసూల్ మాట్లాడుతూ మంగళవారం నిర్వహించిన శిబిరంలో మిల్లు తరుపున 30 యూనిట్లు బ్లడ్ డొనెట్ చేసినట్లు తెలిపారు. రక్తదానం చేయడం వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవని, తాజా రక్తం తక్కువ సమయంలోనే తిరిగి శరీరంలో సరిపడా రక్త ఉత్పత్తి అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎండీ దాసరి చంద్రశేఖర్, జెఎండీ కె రమేష్, ఈడీ డి రాజా, టీడీ జి సీతయ్య, హెచ్‌ఆర్ మేనేజర్ చల్లా రమణమూర్తి పాల్గొన్నారు.

## కార్తిక వనసమారాధన



**రొంపిచర్ల:** మండలంలోని వి.రెడ్డిపాలెం శివాలయ ఆవరణలో సోమవారం రాత్రి నిర్వహించిన కార్తిక వన సమారాధన కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమారాధనకు హాజరైన భక్తులందరికీ కార్తిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీరి వెంట మండల పార్టీ కన్వీనర్ కురుగుంట శ్రీనివాస రెడ్డి, పచ్చవ రవీంద్రబాబు, పునుగోటి వెంకట్రావు, గాడిపర్తి సీతయ్య, బీరం భాస్కర్ రెడ్డి, హనిమిరెడ్డి తదితరులు ఉన్నారు.

## క్యాన్సర్‌తో అప్రమత్తత అవసరం



విద్యార్థినులకు వ్యాక్సిన్లు వేస్తున్న దృశ్యం

**చిలకలూరిపేట:** క్యాన్సర్ వ్యాధి పట్ల అప్రమత్తత అవసరమని ఒమేగా ఆసుపత్రికి చెందిన అంకాలజిస్ట్ డాక్టర్ ప్రవీణ్ చెప్పారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో ఒమేగా ఆసుపత్రి సౌజన్యంతో పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో మహిళలకు ఉచిత గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ పరీక్షల శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవయసు స్త్రీలు ఎక్కువశాతం గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రామకృష్ణ సేవా సమితి సహకారంతో ఆరుగురు బాలికలకు క్యాన్సర్ వ్యాధి సోకకుండా వ్యాక్సిన్‌ల ను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న బాబురావు, సాల్మన్‌పాల్

**నరసరావుపేట రూరల్:** ఆర్థిక పరమైన నియంత్రణ కుటుంబ స్థాయి నుంచి అలవాటు చేసుకోవాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ అరండల్‌పేట శాఖ మేనేజర్ సి.హెచ్.బాబురావు తెలిపారు. రోటరీ కమ్యూనిటీ హాల్‌లో భారతీయ రిజర్వు బ్యాంక్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో ఖాతాదారుల చైతన్య, అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో బాబురావు మాట్లాడుతూ స్తోమతకు మించి అప్పు చేయరాదని సూచించారు. బ్యాంకింగ్ రంగంలో అనేక అవకాశాలున్నాయని తెలిపారు. సదస్సుకు ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్‌పాల్ అధ్యక్షత వహించగా శ్యాం సుందర్, షేక్ బాజి, నల్లపాడు మాజీ సర్పంచ్ విజయ భాస్కర్, మెప్మా ఆర్పీ మేరి జోత్న పాల్గొన్నారు.

## అటవీయేతర ప్రాంతాల్లో చెట్లను పెంచాలి

**నరసరావుపేట రూరల్:** అటవీయేతర ప్రాంతాల్లో చెట్లను పెంచడం ద్వారా పర్యావరణానికి మేలు చేయడంతో పాటు రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఉద్యాన శాఖ అధికారి దాసరి నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని పమిడిమర్రు గ్రామంలో మంగళవారం అటవీ యేతర ప్రాంతంలో చెట్ల పెంపకం కార్యక్రమంపై రైతులకు అవగాహన, శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యాన వన మొక్కలు, అడవి జాతి మొక్కలు వ్యవసాయ భూమిలో నాటడం వల్ల కలిగే ఉపయోగాలను, అదనపు ఆదాయాన్ని తెలియజేశారు. ఢిల్లీ వంటి పట్టణాలలో కాలుష్యం వలన అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. టేకు, ఎర్రచందనం, సరుగుడు వంటి మొక్కలు చెట్ల గట్టులపై ఖాళీగా ఉన్న పొలాలలో పెంచడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని తెలిపారు. మొక్కలు ఐదు నుంచి 20 సంవత్సరాలు పెంచడం ద్వారా రైతులకు లాభదాయకంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో టీఓఎఫ్‌ఐ ప్రోగ్రాం ప్రతినిధి వెంకటేష్, గ్రామ సర్పంచ్ దాసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌కు మరో బస్సు ఏర్పాటు చేయలేం



గ్యారేజ్‌లో కండక్టర్లు, డ్రైవర్లను అభినందిస్తున్న డిపో మేనేజర్

**నరసరావుపేట:** స్థానిక ఆర్టీసీ డిపో నుంచి పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌కు మరో బస్సు ఏర్పాటుచేయలేమని డిపో మేనేజర్ జీవీఎస్ఎస్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక డిపో కార్యాలయం నుంచి నిర్వహించిన డయల్‌యువర్ మేనేజర్ కార్యక్రమానికి రెండు సమస్యలు వచ్చాయి. నాదెండ్ల మండలం గొరిజవోలు నుంచి శ్రీనివాసరావు ఫోన్‌చేసి సెలవు దినాల్లో తమ గ్రామానికి బస్సు రావట్లేదని, పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌కు మరో బస్సు ఏర్పాటుచేయాలని కోరారు. దీనిపై మేనేజర్ స్పందిస్తూ మీ గ్రామానికి సెలవు దినాల్లో సైతం బస్సు ఏర్పాటుచేస్తామని అన్నారు. టర్నింగ్‌లో లైట్లు ఏర్పాటుచేస్తామని, టెర్మినల్‌లో బస్సు ఆగే పాయింట్‌ను మార్చుతామని పేర్కొన్నారు.

**డ్రైవర్లు, కండక్టర్లకు అభినందన**

గ్యారేజ్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో డిపో మేనేజర్ జీవీఎస్ఎస్ కుమార్ అత్యధిక ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లు, అత్యధిక ఆదాయం తీసుకొచ్చిన కండక్టర్లను పూలదండలతో పుష్పగుచ్చాలతో సన్మానించి వారికి క్యాష్ అవార్డు అందజేశారు. వీరిని ఆదర్శంగా తీసుకొని మిగతా వారు కూడా డిపో అభివృద్ధికి పాటుపడాలని కోరారు. గ్యారేజీ ఇంచార్జ్ లావణ్య, అసిస్టెంట్ మేనేజర్ అన్నపూర్ణ, గ్యారేజీ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

## నరసరావుపేటలో మహా ప్రదర్శనను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రాంబాబు

**నరసరావుపేట ఈస్ట్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక, వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన దేశ వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ఎదుట తలపెట్టిన మహా ప్రదర్శన, ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు తెలిపారు. అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతూ ప్రభుత్వ రంగ సంస్థలపై సవతిప్రేమ చూపిస్తున్నదని ఎద్దేవా చేశారు. రాజ్యాంగ దినోత్సవం జరుపుకునే నవంబర్ 26వ తేదీన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరికల నోటీసులు జారీ చేస్తు కలెక్టర్ కార్యాలయాల ఎదుట జరగనున్న ఆందోళనలో రైతులు, కార్మికులు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవపూడి రాము, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు బూదాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## రైతు నిరసన సభ విజయవంతం చేయండి

**శావల్యాపురం:** అఖిల భారత సంయుక్త కిసాన్ మోర్చా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 26న నరసరావుపేటలో జరిగే రైతుల నిరసన సభా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతుసంఘం నాయకులు సీపీఎం మండల కార్యదర్శి కె.వి.ఆర్. మోహన్‌చందు కోరారు. మంగళవారం మండలంలోని మతుకుమల్లి గ్రామంలో రైతు సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మోహన్‌చందు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పోరేటు వ్యవసాయ విధానాలను వ్యతిరేకిస్తూ స్వామినాధన్ కమీషన్ సిఫార్సులు మేరకు రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో వరి పండించిన రైతులకు మద్దతు ధరతో పాటు రూ.500 రూపాయలు బోనస్ ఇవ్వాలన్నారు. భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు కార్డులు మంజూరు చేయాలన్నారు. గత పది సంవత్సరాల్లో కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.19.28 లక్షల కోట్లు రుణమాఫీ, పన్ను రాయితీ పేరుతో ప్రజాధనాన్ని దోచిపెట్టిందన్నారు. రైతులకు ఇవ్వాల్సిన ఎరువుల రాయితీను తగ్గించిందని, దీనివలన రైతులకు ఉత్పాదన వ్యయం పెరిగి వ్యవసాయం గిట్టుబాటు కావటం లేదన్నారు. రైతుల పంటల ఉత్పత్తులకు ఉత్పత్తి ఖర్చు, కుటుంబ శ్రమను జోడించి మరో 50 శాతం కలిపి మద్దతు ధర ప్రకటించాలన్నారు. ఈసమావేశంలో రైతు సంఘం నాయకులు పచ్చవ శ్రీనివాసరావు, ముంద్రు వెంకటరావు, పాపసాని కోటేశ్వరరావు, ముంద్రు రామాంజినేయులు, నరిశెట్టి మల్లయ్య, చింతా నారాయణ, భువనగిరి వెంకటేశర్లు, పాపసాని సుబ్బారావులు పాల్గొన్నారు.

### ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

**శావల్యాపురం:** గ్రామసచివాలయాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరాల సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 20న పొట్లూరు గ్రామ సచివాలయం, 21న వేల్పూరు-1, 22న వేల్పూరు-2 గ్రామసచివాలయాల పరిధిలో ప్రత్యేకంగా ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఆధార్‌లో తప్పులు సవరణలు, అడ్రస్‌లు మార్పులు చేర్పులు, తదితర సేవలను అక్కడ అందజేస్తారన్నారు.

### రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

**రొంపిచర్ల:** మండలంలో కొత్తపల్లి, ఎడ్వర్డ్‌పేట గ్రామాలలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలలో రైతులు సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు వెంకటట్, వేమారెడ్డి, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### వర్సిటీ జూడో జట్టుకు కృష్ణవేణి విద్యార్థి

**నరసరావుపేట ఈస్ట్:** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జూడో జట్టుకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థి పి.శ్రావణ్‌కుమార్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబు మంగళవారం తెలిపారు. వర్సిటీ వ్యాయామ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాలల జూడో పోటీ, వర్సిటీ జట్టు ఎంపిక పోటీలో శ్రావణ్ కుమార్ మైనస్ 90 కేజీల విభాగంలో ప్రతిభ కనపరిచి జట్టుకు ఎంపికయ్యాడని వివరించారు. ఈనెల 27 నుంచి 30వతేదీ వరకు భోపాల్‌లో నిర్వహించనున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల జూడో పోటీలో ఏఎన్‌యూకు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు.